

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గురువారం,17 ఏప్రిల్ 2025

8

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా


## అక్రమార్కులతో దోస్తీ..

# చట్టంతో కుస్తీ



కొందరు అవినీతి అధికారుల అత్యుత్సాహం అక్రమార్కులకు వరంగా మారుతోంది.. ఎల్.పి.నెం. 132/89, ప్లాట్ నెం. 196, 197లలో బి.ఎ.నెం.245, 246లుగా ఇంటి నిర్మాణానికి అనుమతులు పొంది... ఆ నిర్మాణ అనుమతులకు పూర్తి వ్యతిరేకంగా 530 చ?గజాలలో ఎటువంటి సెట్‌బ్యాక్స్ వదలకుండా ఒకే అతిపెద్ద నకిలీ అనుమతుల అపార్ట్‌మెంట్ అవినీతి అధికారుల అండదండలతో సాగుతున్న అక్రమ నిర్మాణాలపై సూర్య పత్రికలో వచ్చిన సంచలన ప్రత్యేక కథనంపై జిల్లా కలెక్టర్ షాన్మోహన్ పంచాయితీ అధికారులు ఇతర అధికారుల తీరుపై అక్రమ కట్టడాలపై సీరియస్ అయ్యారు. వెంటనే చట్టపర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు... అయితే గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాలకు సైతం విద్యుత్,పంచాయితీ శాఖలఅధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అక్రమార్కులతో దోస్తీ చేస్తున్న అవినీతి విద్యుత్ అధికారులు...


- జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సీరియస్... త్వరిత చర్యలకు ఆదేశాలు..
- ఆగని నకిలీ అనుమతులతో అక్రమ భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణం..
- కోర్టు స్టే తెచ్చుకోవాలంటూ అక్రమార్కులకు సూచన..
- నోటీసులతో చర్యలకు కాలయాపన
- అడుగడుగునా లక్షలు వెదజల్లుతున్న అక్రమ నిర్మాణదారులు..

### అక్రమ నిర్మాణదారులకు విద్యుత్ అధికారుల అండదండలు

చట్టంతో కుస్తీ పట్టండంటూ అక్రమ నిర్మాణ దారులకు సూచనలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నకిలీ అనుమతుల అపార్ట్‌మెంటు నిర్మాణదారులు కోర్టుకెళ్ళి స్టే తెచ్చుకునేలా 12 విద్యుత్ సర్వీసులు తొలగింపునకు వారికి అనుకూలంగా నోటీసులు ఇచ్చారని చెబుతున్నారు. ఆరుగురి పేరుతో అక్రమ భవంతికి 12 విద్యుత్ సర్వీసులు ఇచ్చారు. పంచాయతీ అధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఆరుగురికి విద్యుత్ సర్వీసుల తొలగింపునకు నోటీసులు ఇవ్వాల్సివుండగా అక్రమార్కులకు లబ్ధి చేకూర్చేలా అవినీతి విద్యుత్ అధికారులు మచా ఇందిరా ఆశాలత పేరుతో 12 విద్యుత్ సర్వీసుల తొలగింపు నోటీసు ఇచ్చేసారు. దీనిపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ శాఖ అక్రమార్కుల నుంచి లక్షల్లో ముడుపులు మింగి అండగా ఉంటూ, తూతూమంత్రంగా నోటీసులు ఇచ్చి కాలయాపన చేస్తుండటం, అక్రమార్కులు హైకోర్టుకు వెళ్లేలా సహకరిస్తున్నారనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి... సూర్య ప్రత్యేక కథనంతో కలెక్టర్ షాన్మోహన్ సీరియస్ అయినా, సంబంధిత అధికారుల్లో కదలిక వచ్చినప్పటికీ... అమ్యామ్యాలు తీసుకున్నందుకు అక్రమార్కుల పక్షానే నిలిచేందుకు తాపత్రయపడుతుండటం గమనార్హం. విద్యుత్ అధికారుల్లో అవినీతి, నల్ల కుబేరుల ధనార్జన... అక్రమార్కుల పక్షాన నిలుస్తున్న వైనంపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...


ఉమ్మడి గోదావరి జిల్లాలసూర్య బ్యూరో :


- మిగతా 2 లో..














# మండలాలకు ప్రత్యేక అధికారులు నియామకం

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం వివిధ ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధిహామీ పథకం ఎపిడి,ఏపీఓలు, బిఎస్ఎన్ఎల్ అధికారులతో మంజూరైన పనులు త్వరితగతిన పూర్తిచేసే విధంగా ఐటీడీఏ పీవో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో వివిధ ఇంజనీరింగ్ శాఖలు ద్వారా మంజూరైన పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తిచేయాలన్నారు.అలాగే ఏజెన్సీ ప్రాంతంలో మంజూరైన గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు నిరంతరాయంగా

- తరువాయి 2లో..

## డీసీసీబీ చైర్మన్‌గిరీ

# ఎవరి పరం..!

- ఏకగ్రీవంగా మెట్ల రమణబాబు పేరు.? - సీనియర్ నాయకునికిగా ప్రాధాన్యత..





- మిగతా 8 లో..

# చదువుల తల్లులకు నూజివీడు బిజెపి నేతల చిరు సత్కారం





**నూజివీడు,మేజర్‌న్యూస్ :** ఇంటర్ విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన చదువుల తల్లులకు నూజివీడు పట్టణ బిజెపి అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు చిరు సత్కారం చేశారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో నూజివీడు చరిత్రలోనే మొట్టమొదటి సారిగా 991 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచిన శ్రీ శారద కళాశాల విద్యార్థిని కుప్పాల దేదీప్యసాయిని బుధవారం కళాశాల ఆవరణలో మల్లెపూడి నాగరాణి, సీనియర్ నాయకులు బోను అప్పారావులు దుశ్శాలవాలతో సత్కరించి,భారత మాత మెమెంటోను బహుకరించారు. విద్యార్థిని తల్లిదండ్రులైన, కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ కుప్పాల శంకరరావు,రాదికలకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లెపూడి నాగరాణి మాట్లాడుతూ విద్యలవాడగా భాసిల్లుతున్న నూజివీడు పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికమార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు పొందడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతంలో ముఖ్యంగా కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు ధీటుగా శ్రీశారద విద్యాసంస్థలు నిలవటం నూజివీడుకే గర్వకారణమన్నారు. తల్లీదండ్రుల ప్రోత్సాహం, కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం నిరంతర శ్రమ, విద్యార్థిని కృషితో సాధించిన ఈ ఘనత చిరస్మరణీయమన్నారు. స్నేహరైడ్స్ 'శైలు'ప్రతిభస్పూర్తి దాయకం. నూజివీడు స్నేహరైడ్స్ చిల్డ్రన్స్ హోమ్‌లో ఆశ్రమం పొంది ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసిస్తూ ఎటువంటి ట్యూషన్ లేకుండా బైపీసీలో 772 మార్కులు సాధించి బి.శైలు స్పూర్తిగా నిలిచిందని బిజెపి శ్రేణులు కొనియాడారు. చిన్నతనంలో తల్లీదండ్రులుకోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్నశైలుని స్నేహరైడ్స్ ఆదరణలో చదువులతల్లిగాఎదగటం అభినందనీ యమన్నారు. విద్యార్థిని శైలుని ఈసందర్భంగా బిజెపిఅధ్యక్ష, ఉపాధ్యక్షు రాలు మల్లెపూడి నాగరాణి, రాయపాటి విజయ లీలా జ్యోతి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు షేక్ బాజీమా దుశ్శాలవాతో సత్కరించి మెమెంటోను, మల్లెపూడి నాగ రాణి నగదు బహుమతిని అందచేశారు. ఈకార్యక్రమంలో స్నేహరైడ్స్ అధినేత బసవరాజు నగేష్,పార్టీ నాయకులు అంబటి మల్లేశ్వరరావు, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి దద్దనాల రవికిషోర్, కార్యదర్శి సూర్యప్రకాష్ కుమార్ శ్రీశారద అధ్యాపకులు,సిబ్బంది,స్నేహరైడ్స్‌విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

### టిడిపి నేత వీరమల్లు





**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు.వడాలి గ్రామంలో పంచిరెడ్డి రాజారావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి,మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పాదచారులకు, ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.దాతలు ముందుకొచ్చి ప్రధాన కూడళ్ళలో,రహదారుల పక్కన చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నక్కా రంగారావు,నక్కా అప్పారావు,బొంతు వెంకటరంగ అప్పారావు ,బొంతు మహేష్, మరడాని సత్యనారాయణ, మారగాని శంకరరావు, తరంగబాబు, బొర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మండలాలకు ప్రత్యేక అధికారులు నియామకం

మొదటిపేజి తరువాయి

ప్రజలకుఇబ్బందిలేకుండా కరెంటు సరఫరా చేయాలన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందన్నారు.వర్షాకాలంలోమంజూరైనపనులు సకాలంలో పూర్తి చేసేందుకు ఇసుక కొరత లేకుండా ముందుగా ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో మంజూరైన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు, లైన్లుజూన్ నెలాఖరునాటికిపూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు కూలీలకు వేతనాలు సకాలంలో అందించేందుకు అప్లోడ్ చేయాలన్నారు.ఈకార్యక్రమంలో ఉపాధి హామీపథకం ఏపీడి జి.శ్రీనివాస రావు,ఎగ్జిక్యూటివ్ఇంజనీర్లు ఐ.శ్రీనివాస రావు, రవి కుమార్, సుబ్బయ్య,మల్లికార్జున, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, పి.వెంకటరమణ,సాయిసతీష్, సుబ్బారావు,శివ,మల్లికార్జునరావు, ఉమాశంకర్, శ్రీనివాస రావు, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

# మరణించిన ఉపాధి హామీ కూలీలకు రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి

### వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**మొగల్తూరు,మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పనిచేస్తు ప్రమాదంలో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు10 లక్షలు చొప్పున ఇవ్వాలని, గాయపడిన కుటుంబానికి 5లక్షల ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి,జక్కంశెట్టి సత్యనారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు.బుధవారం మొగల్తూరు హైవే పక్కన పంట కాలువలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలుపై మొగల్తూరు వైపు మంచి నూనె లోడుతో వస్తున్న వాహనం కూలీల పైకి దూసుకు వెళ్లడంతో కదలి పావని,గుబ్బల గంగాదేవి ఇద్దరూ వాహనం కింద ఇరుక్కుపోయి వెంటనే చనిపోయారు.గుబ్బల మాణిక్యాలరావు, గుబ్బల సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు.గాయపడ్డ మాణిక్యాలరావును భీమవరం వర్మ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు.సత్యనారాయణకు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు.మరణించిన కదలి పావనీకి పెండ్లికి వచ్చిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తీవ్రంగా గాయపడ్డ మాణిక్యాలరావు మరణించిన గంగాదేవికి భర్త. వీరంతా వ్యవసాయ కార్మిక కుటుంబాలు కావడం ఆగ్రామ ప్రజలంతా నరసాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద బోరును విలపిస్తున్న పరిస్థితి ఉంది. ఈసందర్భంగా నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి బయట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు నిరసన



కార్యక్రమం తెలిపారు. ఈసందర్భంగా జార్జి పెద్దిరాజు సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి కేవలం 50వేలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉందని కానీ ఇక్కడ జరిగిన ప్రమాదం దానికి వర్తించదని ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ చర్చించి మరణించిన వారి కుటుంబానికి 10లక్షలు,గాయపడిన కుటుంబానికి 5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడాల ముత్యాలరావు, మామిడి శెట్టి చందర్రావు, చింతపల్లి నాగేశ్వరరావు,గుడాల సుజాత, మామిడి చెట్టిసత్యవతి,గూడూరి భాస్కరరావు, లక్ష్మీకాంతం, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమార్కులతో దోస్తీ... చట్టంతో కుస్తీ

**ఉమ్మడిగోదావరిజిల్లాలసూర్యబ్యూరో:** ప్రభుత్వాలు మారినా,ఏలకులు మారుతున్నా, అధికారుల తీరు మాత్రం మారడం లేదు. ప్రజలకు సేవలందిస్తూ జవాబుదారీతనంగా విధులు నిర్వర్తించాల్సిన కొందరు ప్రభుత్వ ఉద్యోగులు విద్యుత్, పంచాయితీరాజ్ శాఖల్లోవసూల్‌రాజాలుగా వ్యవహరిస్తున్నారు. వీరు పనిచేయాలంటే చేయి తడపనిదే సామాన్యుల ఫైళ్ళు ముందుకు కదలని పరిస్థితులు నెలకొ న్నాయి. ఒక్కో పనికి ఒక్కో రేటును వెలకడుతూ లంచాలు దిగమింగి, ఎంతటి అక్రమానికైనా సై అంటున్నారు. అక్రమార్కుల కోసం పై అధికారులను సైతం బురిడీలు కొట్టిస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఆ కోవలోకే ఈ వ్యవహారం చేరింది. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గ్రామ పంచాయితీ పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీ, వసంత్‌నగర్ లేఅవుట్ ఎల్.పి.నెం. 132/89లో 196, 197 ప్లాట్లు రెండు కలిపి 530 చ?గజాల స్థలం ఉంది. ఒకే అతిపెద్ద అపార్టుమెంట్ నిర్మించాలంటే ప్రధాన రోడ్డు తూర్పువైపు సుమారు 16 అడుగులు సెట్‌బ్యాక్స్‌గా ఖాళీ స్థలం వదలాల్సి వుంది. అలాగే మిగిలిన మూడువైపులా 6 అడుగుల ఖాళీ స్థలం సెట్‌బ్యాక్స్ వదలాలి. 'కుడా' కి ప్లాన్ ప్రకారమే నిర్మిస్తామని 10 శాతం చదరపు అడుగులు నిర్మాణంలో ఉన్న భవంతిలో మార్ట్ గేజ్ చేసి ఇవ్వాలి. అలాగే ఫీజులు ప్రభుత్వానికి అధికంగా చెల్లించాల్సి వుంటుంది. ఈ గొడవలు, నిబంధనలు లేకుండా రెండు ప్లాట్లలో రెండు ప్లానులు విడివిడిగా తీసుకుని ఒకే అతిపెద్ద అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు.అడ్డుకోవాల్సిన అధికారులు లంచాలు లక్షల్లో దిగమింగారు. ఈ అక్రమాలపై సూర్యసంచలన కథనం ప్రచురించింది. అక్రమార్కులపై చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినా అవినీతి అధికారుల్లో చలనం లేదు. నోటీసులు తూతూమంత్రంగా ఇచ్చి అయ్యిందనిపించేలా చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రి.క.నెం. 8/2025గా పంచాయితీ నుంచి డి8 సెక్షన్ ఎలక్ట్రికల్ ఎఈ కి సంబంధిత అక్రమ కట్టడానికి ఇచ్చిన 12 సర్వీసులు నిలుపుదల చెయ్యాలని ఈ నెల 14వ తేదీన ఆదేశాలు అందినా పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. డిపిఓ వరప్రసాద్ రంగంలోకి దిగి విద్యుత్ శాఖలో పై అధికారులతో మాట్లాడితేగానీ అతీగతీ లేని పరిస్థితి. తీరా బుధవారం 16వ తేదీన 12 విద్యుత్ సర్వీసుల తొలగింపునకు నోటీసులుజారీచేసినాఅదీ అక్రమార్కులకు సహాయకారిగానే వుంది. మార్చి నెలలో లంచాలు దిగమింగి ఇచ్చిన 12 సర్వీసులు 6గురు పేరుతో ఇచ్చారు. ఎవరైతే విద్యుత్ సర్వీసులు కలిగివున్నారో వారి పేరున ఇవ్వకుండా గుత్తంగా ఒకే పేరున నోటీసులు ఇవ్వడం మరియు వారికి హైకోర్టు ద్వారా స్టే తీసుకోండి మీకు ఏఇబ్బందీ లేదని సలహాలు ఇవ్వడం ఈ అవినీతి నల్లకుబేరులకే చెల్లింది.

**అవినీతి అంతా ఇంతా కాదు...**రెండు ప్లాన్ల బి.ఎ నెంబర్లు 245/2023,బి.ఎ. నెం 246/2023గా పంచాయితీ నుంచి అనుమతులు తీసుకున్నారు. రెండు భవనాలు విడివిడిగా కట్టకోవడం సహజం. ఎందుకంటే ఇద్దరూ యజమానులు వేరు. కాని ఇక్కడ ఒకటే పెద్ద భవనం అపార్ట్మెంట్‌గా నిర్మాణం చేసేస్తున్నారు. ఇదే విషయాన్ని పరిశీలన చేశారు. కరెంటు ఇవ్వడం కుదరదని చెప్పారు. అయితే డివిజన్ స్థాయి అధికారి రంగంలోకి దిగి లక్షల్లో లంచాలు మాట్లాడుకొని రెండు ప్లాన్లు ఉన్నా... రెండు భవంతులు లేకపోయినా... నిర్మాణంలో ఉన్న అతిపెద్ద ఒకే అపార్టుమెంటుకు 12 సర్వీసులు ఇచ్చేశారు. ఇది ఇంతా అంతా అవినీతి కాదు మహా అవినీతి. అయితే ఇప్పుడు గౌరవ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలతో కుడితిలో పడ్డ ఎలుకలా వుంది విద్యుత్ అధికారులపరిస్థితి. సర్వీసులు తీయడానికి వెళితే అక్రమార్కులు ఊరు కోరు... దీంతో వారికి తూతూమంత్రంగా నోటీసులుఇచ్చికాలయాపన చేయడంతో పాటు, హైకోర్టుకి వెళ్ళి స్టే తెచ్చుకోవాలని హైకోర్టు లాయర్ పేరు కూడా వీరే చెప్పినట్లుగా సమాచారం. ఇంత దిగజారుడు విధులు చేయడం వీరికే చెల్లింది.కుడావిసిభావన, ఐఎఎస్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఐఎఎస్‌లు అక్రమ నిర్మాణాలపై చట్టపర చర్యలు తీసుకోవడంతో పాటు, ఇటువంటి అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సినఅవసరంఎంతైనాఉందనిస్థానికులు వేడుకొంటున్నారు.

## వైసీపీ నేత పప్పుల రామారావు కుమారుని వర్థంతి సందర్భంగా అన్నదానం

**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** వైయస్సార్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పప్పుల రామారావు కుమారుడుపప్పుల భాస్కర శ్రీకృష్ణ నరేష్ 15వ వర్థంతి సందర్భంగా బుధ వారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా రుస్తుం బాధ లెప్రసి కాలనీ లోని పేదలకు, బొండమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు,పాత బజార్ సాయిబాబా గుడి వద్ద పలుచోట్ల అన్న అన్నదానం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ఉద్యోగులు నిరంతరం కృషి చేయాలి

## - ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్





**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారంలో సచివాలయం సిబ్బంది నిరంతరం కృషి చేయాలని రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్ అన్నారు. బుధవారం రాజవొమ్మంగి,దూసరపాము, అమీనాబాద్ సచివాలయాలను ఆమెఆకస్మిక తనిఖీ చేసారు.అమీనాబాద్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను కూడా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టాక్ రూమ్, మెనూ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలానే నాణ్యమైన ఆహారం అందించి విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది హాజరు పట్టి పరిశీలించారు. ప్రజల నుండి వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సకాలంలో పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహించితే సహించేది లేదు అన్నారు. తొలి తగసూరంపాలెం టీడీపీ కార్యకర్త విసం శెట్టి సత్తిబాబు కుమార్తె రజస్వల పంక్షన్ కు ఎమ్మెల్యే శిరీష భాస్కర్ దంపతులు హాజరై చిన్నారిని ఆశీ ర్వధించారు. అనంతరం రాజవొమ్మంగి మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేసి సచివాలయాలు, ఆశ్రమ పాఠశాలలుఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎమ్మెల్యే పర్యటనలో ఏఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి, బడదానాంపల్లి సర్పంచ్ జి. లక్ష్మీదుర్గ, గణజాల తాతారావ్, దంతులూరి ప్రశాంత్ వర్మ, ఎంపీటీసీ సత్తిబాబు, పెదిరెడ్ల సత్తిబాబు, చిటికెల వెంకటరమణ, మరిడియ్య, చిట్టి సుబ్బారావు, వాసంశెట్టి గంగాధర్, బారంగి అనుదీప్, చెక్కా పండుబాబు, మరిచెట్ల శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక సీఐ ఎన్ సన్యాసినాయుడు అధ్వర్యంలో జడ్డంగి ఎస్ ఐచినబాబు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# మొదటి విడత ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ ప్రారంభం

**ఎటపాక, మేజర్ న్యూస్ :** మలేరియా నివారణలో ప్రధానమైన అంకం దోమల నివారణ 2025 సంవత్సరపు మొదటి విడత దోమల నిర్మూలన కార్యక్రమం ఐఆర్ఎస్ (ఇండోర్ రెసిడ్యూల్ స్ప్రే) పిచకారి ఏప్రిల్ 16న బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక పిహెచ్‌సి పరిధిలోని బుట్టాయిగూడెం గ్రామంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డా. పుల్లయ్య నేత్రుత్వంలో వైద్యాధికారి డా. విష్ణుప్రియ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డా. పుల్లయ్య మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాలలో మలేరియా వ్యాప్తి మైదాన ప్రాంతాలకన్నా ప్రమాదకరంగా ఉంటుందని, ప్రజలు మలేరియా మహమ్మారి బారిన పడకుండా సురక్షితంగా ఉండాలంటే ఐఆర్ఎస్ పిచకారి కార్యక్రమానికి పూర్తిగా సహకరించాలని ఆయన తెలియజేశారు. గ్రామాలలో ఉన్న ప్రతి ఇల్లు పరిసరాలు, పశువుల, మేకల పాకలు, కోళ్ల పాకలు ఏది వొదలకుండా దోమల నివారణ మందు ఐఆర్ఎస్ పిచకారి చేయడం సిబ్బంది కర్తవ్యం అని, పిచికారీ చేపించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని, ప్రజల సహకారం లేనిదే ఈ



కార్యక్రమం సంపూర్ణం కాదని, మలేరియా మహమ్మారిని నిర్మూలించాలంటే ప్రజలు, వైద్య సిబ్బందికి సహకరిచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూపెర్వైజర్ సీతమ్మ, ఏఎన్ఎంలు,హెల్త్ అసిస్టెంట్లు, ఫార్మసిస్ట్, ఎల్‌టిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ కల్లేపల్లి రాజేష్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** క్రీడలపై ఉన్న మక్కువతో యువతను ప్రోత్సహిస్తూ వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కల్లేపల్లి రాజేష్ కృషి చేస్తున్నారని కూడా చైర్మన్ తుమ్మలబాబు అన్నారు. బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో కల్లేపల్లి రాజేష్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూడా చైర్మన్ తుమ్మల బాబు, జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్, ఎస్సై రఘునాథరావు జన్నల శంకర్, పసుపులేటి పవన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడి పుట్టిన ఊరు పై మమకారంతో ఎన్నారై కల్లేపల్లి రాజేష్ ఎన్నో లక్షల రూపాయలను ఖర్చు పెట్టి చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం సీనియర్ క్రికెట్ ప్లేయర్లను, గ్రామానికి చెందిన ప్రముఖులను ముఖ్య అతిథులను సాలువాల్తో సత్కరించి మేమెంటోళ్లు అందజేశారు. ప్రారంభ మ్యాచ్లో కట్టమూరు మర్రిపాక జట్లు తలపడగా తుమ్మలపల్లి రమేష్ టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా 40 టీంలు పాల్గొనేందుకు ఆసక్తి చూపించారు. నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు 55,555, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు 33,333 మరియు మెమొంటో అందించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రతి మ్యాచ్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులకు షీల్డ్‌తో పాటు నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రతి జట్టుకు ప్రోత్సాహక బహుమతి 2000 రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు ప్రతిరోజు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

## శ్రీ శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద మజ్జిగ పంపిణీ




**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం వేవివి దృష్ట్యా దేవదాయ శాఖ ఆదేశాల మేరకు దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద బుధవారం దేవస్థాన సిబ్బంది మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ, బాటసారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.9.98 లక్షల వ్యయంతో ఆరో ప్లాంట్ నిర్మాణం

### - భూమి పూజ చేసిన సర్పంచ్ రమణి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని రాజవొమ్మంగి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు రూ 9.98 లక్షల వ్యయం తో ఆర్వో ప్లాంట్, షెడ్డు ,బోరు నిర్మాణానికి బుధవారం గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి భూమి పూజ చేశారు. ఓ ఎన్ జి సి రాజమండ్రి వారి ఆర్థిక సహాయంతో ఓ ఎన్ జి సి సి ఎస్ ఆర్ ఎస్సీ, ఎస్ టి కాంపొనెండ్స్ పండ్ నుండి నిధులు మంజూరు చేయడం జరిగిందని సర్పంచ్ రమణి, హెచ్ఎం గోపాలకృష్ణ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలోపాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్ది రాజు , ఓ ఎన్ జి సి అధికారి కిరణ్, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.


## ముమ్మిడివరం నగర పంచాయితీ

ఆర్.ఒ.సి. నెం: 41/2025/ఇ1 తేది. 16.04.2025

**ఇప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు**

ముమ్మిడివరం నగర పంచాయితీ, పారిశుధ్య విభాగమునకు సంబంధించి సాధారణ నిధులతో ఒక (1) పనికి 2 నెం. అద్దె ట్రాక్టర్లు ట్రైలర్లతో సహా (మే, 2025 నుండి అక్టోబరు, 2025 వరకు) సప్లై చేయుటకు రూ.5.45 లక్షల అంచనాలతో ఇప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండరు పిలువబడినవి.

**బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ :**
17-04-2025 ఉదయం గం॥ 11.00ల నుండి

**బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరు తేదీ :**
21-04-2025 సాయంత్రం గం॥ 3.00ల వరకు

**బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు ఆఖరు తేదీ :**
21-04-2025 సాయంత్రం గం॥ 4.00ల వరకు

మిగిలిన వివరముల కొరకు కార్యాలయ పని వేళలలో ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించగలరు.

కమిషనరు,
ముమ్మిడివరం నగర పంచాయితీ

# ర్యాలీలో పట్టిపీడిస్తున్న ఆక్రమణలు





**– పట్టించుకోని అధికార యంత్రాంగం – తరచూ ట్రాఫిక్ జామ్**

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** ప్రముఖ పర్యాటక క్షేత్రంగా విరాజిల్లుతున్న ర్యాలీ గ్రామాన్ని ఆక్రమణల బెడద పట్టిపీడిస్తుంది ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ ఏరోడ్లు చూసిన పక్క అక్రమ కట్టడాలతో కుచించుకుపోతున్నాయి. నియోజకవర్గంలో 13 వేల జనాభా గల అతిపెద్ద ఈ గ్రామానికి నిత్యం వేలాదిమంది భక్తులు వస్తుంటారు. ఇక్కడ వెలసిన జగన్మోహిని కేశవస్వామివారిని ఉమాకమండలేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. వారి వచ్చే వాహనాలు గ్రామ మొగదలలో ఉన్న వంతెన నుండి గ్రామం సెంటర్ వరకు ఇరుపక్కల ఆక్రమణలు పెరిగిపోవడంతో రహదారి బక్క చిక్కిపోయింది టూరిస్ట్ బస్సు రావాలంటే వీలు పడడం లేదు. దీంతో భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజా ప్రతినిధులు అధికారుల పంచాయతీల దృష్టికి తీసుకొస్తున్న ఏ ఒక్కరూ కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. పలుసార్లు గ్రామాల్లో జరిగే గ్రామసభలు మండల పరిషత్‌లో జరిగే సమావేశాల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారుల దృష్టికి తీసుకొస్తూ ఉంటే అదిగో ఇదిగో ఆనడం తప్పించి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఒక్కోసారి ప్రధాన రహదారిలో ఉన్న ఆక్రమణల వల్ల గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఎదురు బదురు వాహనాలను తప్పించాలంటే సాహసం చేయాల్సి వస్తుంది. ఇటీవల ఒక టూరిస్ట్ బస్సు ఆక్రమణల వల్ల దగ్గరలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ను బస్సు ఢీకొనడంతో ట్రాన్స్ఫార్మర్ విరిగిపోయి దెబ్బతింది. ఆ సమయంలో భక్తులు త్రుటిలో ప్రాణాలను దక్కించుకున్నారు. ఆహాకారాలు చేస్తూ బస్సు నుండి దిగిపోయి బయటపడ్డారు.

ఆదిలోనే ఆక్రమణలను గుర్తించి అడ్డుకుంటే సమస్య ఉండేది కాదు. అక్రమ నిర్మాణాలు చేస్తున్న కనీసం నోటీసులు కూడా జారీ చేయడం లేదు. ముఖ్యంగా ర్యాలీ వంతెన నుండి ఆటో సెంటర్ వరకు ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. అలాగే ఇరుకుగా ఉన్న వంతెన స్థానంలో రాకపోకలకు అనువుగా బ్రిడ్జి నిర్మాణం చేపడితే చాలావరకు ప్రయోజనం ఉంటుంది. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై అంబేద్కర్ జయంతి రోజున స్థానిక అధికారులకు ఒక వినతిపత్రం కూడా అందజేశారు. పూలే, అంబేద్కర్ ఆశయం సాధన సమితి వ్యవస్థాపకులు మంగం లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటినుండి ర్యాలి గ్రామం అభివృద్ధికి నోచుకోకపోగా పలు సమస్యలలో ఇరుక్కుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ర్యాలి గ్రామ అభివృద్ధికి పునాదులు వేసిన కొందరు స్వార్థం కోసం అవి పునాదిరాళ్లు గానే మిగిలిపోయాయి. హై స్కూల్ సెంటర్ నుండి లక్ష్మీపోలవరం వెళ్లే రోడ్డుని ఆనుకుని గతంలో 20 అడుగుల వెడల్పు పది అడుగుల లోతు కలిగిన మురుగు కాలవ ఉండేది. అభివృద్ధి పేరుతో దానిని మూడు అడుగులు డ్రైన్‌గా నిర్మించడం వలన ఆక్రమణదారులకు అవకాశం కలిగింది. ఈ మూడు అడుగుల డ్రైన్ వల్ల నీరు ఎటు పోలేని పరిస్థితి నెలకొంది. దోమలకు నిలయం అయి సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. అంతేకాక ఒకవైపు ఇలా ఉంటే రెండు పక్క మురుగు కాల్వను మూసి శాశ్వత కట్టడాలు నిర్మించారు. అయితే ఆ మలుపులో ఉన్న స్థలాన్ని రైతు చేను కోసం ఆక్రమించగా ఆ స్థలం నుండి రోడ్డుకి నాలుగు అడుగుల స్థలంలో ప్రైవేటు వాహనదారులు వారి వాహనాలను నిలిపి రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఈ ప్రమాదాలలో భాగంగా గతంలో 9 సంవత్సరాల పాప ప్రాణాలను కోల్పోయింది. అప్పటినుండి ఆ ప్రాంతంలోని ప్రజలు అక్కడ నిలుపుతున్న వాహనాలను అక్కడి నుంచి ఖాళీ చేయమని పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసిన వారి రాజకీయ అండదండలతో పబ్బం గడుపుతున్నారు. ఆ త్రికోణపు రోడ్డులో భారీ వాహనాలు వచ్చే సమయంలో అటుపక్క ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోపక్క డ్రైనేజీ దాటి వ్యాపారులు కొందరు వ్యాపారాలు నిర్వహించడం ద్వారా ఆ దుకాణాలకు వచ్చిన కొనుగోలుదారులు వారి వాహనాలను రోడ్డు మీదనే నిలిపివేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని ఈ డ్రైన్‌పై ఉన్న ఆక్రమణలు తొలగించి, డ్రైనును శుభ్రపరిచి ప్రజల అనారోగ్యానికి ప్రమాదాలకు ఆడుకట్ట వేయాలని గ్రామసభలో కోరారు.

# సాగు నీటి సమస్యను పూర్తిస్థాయిలో అధిగమించాలి

**– కలెక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చిట్ట చివరి ఆయకట్టు వరకు పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరాకై వ్యవసాయ జలవనరులు రెవెన్యూ అధికారులు పూర్తి సమన్వయం వహించి కార్యాచరణ ప్రణాళిక ద్వారా సాగు నీటి ఎద్దడి సమస్యలను పూర్తిగా అధిగమించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జలవనరులు, రెవెన్యూ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి రబి సీజన్లో సాగు నీటి ఎద్దడి సమస్యలపై సమీక్షించారు. ఉప్పలగుప్తం కాట్రేనికోన, ఐ.పోలవరం రాజోలు అల్లవరం మండలాల్లో కొన్ని గ్రామాలలో ఖరీఫ్ సీజన్లో వరి నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల అకాల వర్షాలు మూలంగా సాగు ఆలస్యమైనందున ఈ నెల 25 వరకు సాగునీరు అందించాల్సి ఉంటుందని క్షేత్రస్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా పంటల సాగుకు సంబంధించిన కారణాలతో నివేదిక రూపొందించిన పిదప నీటిలభ్యతపై జలవనుల శాఖ ఉన్నతాధికారులకు విన్నవించి సాగునీటి కొర తను అధిగమించడం జరు గుతుందన్నారు ప్రతి ఆయ కట్టు ఆఖరి ఎకరా వరకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగునీరు సరఫరాపై ఇబ్బం దులు తలెత్తకుండా చూడా లని, రెవెన్యూ, ఇరిగేషన్ వ్య వసాయశాఖల సమన్వయం చేసుకుంటూ వారాబంది పగడ్బందీగా నిర్వహిస్తూ ఆఖరి ఎకరం వరకు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ ముగుస్తుండడంతో ఈఈ లు, డిఈఈ లు, ఏఈఈ ల వరకు క్షేత్రస్థాయిలో ఉండి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, రబీ పంటకు రానున్న పది, పది హేను రోజుల్లో రైతులకు సాగునీరు అందించేలా ప్రణా ళికాయుతమైన చర్యలు చేపట్టాలన్నారు. నీటి సంరక్షణ పద్ధతులను ప్రోత్సహించేలా రైతులకు సమగ్ర అవగాహనను పెం పొందించడంతోపాటుగా నీటి వృధాను తగ్గించి సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేస్తూ ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా వేసవిలో నీటిపారుదల వ్యవస్థలు మెరుగుదలపై జల వనరులశాఖ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే.మాధవి, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీని వాసరావు, ఎస్‌డిసి కృష్ణమూర్తి, వ్యవ సాయ శాఖ ఏడి సంషి, జలవనరుల శాఖ సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యే కార్యాలయంలో 'ప్రజా దర్బార్'



**రంపచోడవరం,మేజర్‌న్యూస్:** రంపచోడవరంలోని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కార్యాలయంలో సమస్యలపై ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు ప్రజల సమస్యల పరిష్కారానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్, పింఛన్లు, రోడ్లు, సాగు భూమికి పట్టా మంజూరు చేయాలని పలువురు వినతి పత్రాలు అందజేశారు. అలాగే దేవీపట్నం మండలం శరభవరం గ్రామస్తులు కమ్యూనిటీ హాల్, లైబ్రరీ నిర్మాణం చేపట్టాలని, తామ రపల్లి గ్రామస్తులు చేతి పంపు బోరు కొరకు, విఆర్ పురం గ్రామ స్తులు పునరావాసం జాబితాలో పేర్లు నమోదు కొరకు వినతులు ఇచ్చారు. పలు అంశాలపై ప్రజలు నుండి వచ్చిన వినతులు ఎమ్మెల్యే శిరీష దేవి స్వీకరించి, ఆయా ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే సమస్యలపై ప్రజలు వినతులు ఆయా శాఖలకు పంపించి, త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శిరీష దేవి తెలియజేసారు.

## ఎం.ఆదిశేషయ్యకి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ,మేజర్‌న్యూస్:** నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఎం.ఆది శేషయ్య సిద్ధాంత వ్యాసం "ఏ నోవల్ డైనమికల్లీ అప్‌డేటబుల్ పైప్‌లైన్డ్ ఆర్కిటెక్చర్ ఫర్ ప్యాకెట్ క్లాసిఫికేషన్ ఆన్ ఎఫ్‌పిజిఏ" జెఎన్‌టి యుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. ఎం.ఆదిశేషయ్య తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడ జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.ఎం.శైలజ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## బొత్స సత్యనారాయణని మర్యాదపూర్వకంగా కలిసిన జగ్గిరెడ్డి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** శాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి బుధవారం విశాఖపట్నం ఆయన స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, సాలువాలతో సత్కరించారు.

జగ్గిరెడ్డితోపాటు బొత్స సత్యనారా యణని మాజీ అముడా చైర్మన్, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్ రాజు, కొత్తపేట మండల ఎంపీపీ మార్గాన గంగాధర్ రావు, కర్రి నాగిరెడ్డి, కొవ్వూరి సుధాకర్ రెడ్డి, మాగాపు చక్రవర్తి, బెజవాడ నారాయణరావు, తేతలి సత్తిరెడ్డి తదితర నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

# “శ్రీకృష్ణ గీతా అనుగ్రహ” పురస్కారం ప్రదానం



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఆధ్యాత్మిక రంగంలో గత 15 సంవత్సరాలుగా విశేష కృషి చేస్తున్న తత్వవాద తెలుగు ఆధ్యాత్మిక మాసపత్రిక ప్రధాన సంపాదకులు పండితులు విద్వాన్ బి.ఇ. నాగేంద్రాచార్ ను శ్రీకృష్ణ గీత అనుగ్రహ బిరుదుతో ఉడిపి శ్రీ పుత్తిగమఠ పీఠాధిపతులు సుగుణేంద్ర తీర్ధ స్వామీజీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ మధ్వ మతంతో పాటు సామాజిక విషయాలపై విశ్లేషణాత్మకమైన వ్యాసాలను తత్వవాద పత్రిక ద్వారా ప్రజలకు అందిస్తూ ఎంతో అవగాహన కల్పిస్తున్నారని కొనియాడారు. వివిధ పీఠాధిపతులకు ప్రియమైన శిష్యునిగా నాగేంద్ర ఆచార్ గుర్తింపు పొందడమే కాక స్వామీజీల విషయాలకు ప్రచారం కల్పించడంలో తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయమని అన్నారు. గత అయిదు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన తత్వవాద మాసపత్రిక సంపాదక బాధ్యతను స్వీకరించి దశాబ్దన్నర కాలంలో దేశ విదేశాలలో మాధ్వ గృహస్థుల అభిమానాన్ని చురుకున్నారని అభినందించారు. ఎంతో క్లిష్టమైన అంశాలను సైతం శాస్త్రీయ దృక్పథంలో వివరించడం మరియు వాటికి గ్రంథాలను ప్రస్తావించడంలో నాగేంద్ర ఆచార్ తీసుకుంటున్న శ్రద్ధ మధ్వమత ఔన్నత్యాన్ని పెంచేదిగా ఉందని స్వామీజీ అన్నారు. ఉడిపి శ్రీకృష్ణుని అనుగ్రహంతో మరింతగా ఆధ్యాత్మిక సేవను కొనసాగించాలంటూ ప్రత్యేకంగా ఆశీర్వదించారు.

ప్రతిష్టాత్మక బిరుదును స్వీకరించిన తత్వవాద సంపాదకులు నాగేంద్ర ఆచార్ మాట్లాడుతూ గురువుల సేవ ద్వారా సమాజానికి తన బాధ్యతగా అనేక భగవంతుని విషయాలను వివరించడమే తన జీవిత లక్ష్యంగా నిర్దేశించుకున్నానని చెప్పారు. బిరుదుతో పాటు శ్రీకృష్ణుని డాలర్ సహిత తులసి సువర్ణమాలను స్వామీజీ బహుకరించడం భగవంతుని ప్రసాదంగా భావిస్తున్నానన్నారు. నేటితరం వారికి ధర్మసందేహాలు అనేకం ఉత్పన్నమవుతున్నయని వాటిని శాస్త్రీయ, పురాణ మరియు ఆధ్యాత్మిక అంశాలతో వివరిస్తూ వ్యాసాలను తత్వవాద మాసపత్రిక ద్వారా అందించడం జరుగుతోందని దీనివల్ల మధ్వగృహస్తులు సందేహ నివృత్తి చేసుకుంటున్నారని చెప్పారు. తత్త్వవాద సంపాదకులు డాక్టర్ నాగేంద్ర ఆచార్ శ్రీకృష్ణ గీతా అనుగ్రహ అవార్డు ను అందుకోవడం పట్ల కాకినాడ మధ్వసభ సంయుక్త కార్యదర్శి సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ యాతగిరి పరశురామ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సందేశాన్ని శ్రీ నాగేంద్ర ఆచార్ కు పంపుతూ స్వామీజీల సేవలను భగవంతుని సేవగా భావించి క్రమం తప్పకుండా వారి విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించడంలో నాగేంద్ర ఆచార్ ఎంతో శ్రమిస్తున్నారని ప్రస్తావించారు. విద్వాన్ బి.ఈ. నాగేంద్ర ఆచార్‌కు శ్రీ శ్రీకృష్ణ గీతా అనుగ్రహ బిరుదు రావడం పట్ల మధ్వ పురోహితులు యతగిరి మద్వేష్, మధ్వసభ కమిటి కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు, ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, కోశాధికారి వేముగంటి రాము, టంకసాల సత్యనారాయణమూర్తి, జాగీర్దార్ ప్రేమ్ కుమార్, రాచూరి శేషగిరిరావు, ఉదయగిరి శేషగిరిరావు, పన్యాల బుజ్జి, మైలవరపు దీపుతోపాటు అనేకమంది అభినందనలు తెలిపారు.

# నవయుగ వైతాళికుడు కందుకూరి

**పెద్దాపురం రూరల్,మేజర్ న్యూస్ :** నవయుగ వైతాళికుడు, సంస్కరణ ఉద్యమ ఖడ్గదారి కందుకూరి వీరేశలింగం అని సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షులు జ్యోశుల కృష్ణబాబు అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్, భారత విద్యార్థి ఫెడరేషన్, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కందుకూరి జయంతి సభ పిసిసి గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో జ్యోశుల కృష్ణబాబు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ కందుకూరి ఉద్యమాల గురించి తెలిపారు. కందుకూరి స్ఫూర్తితో నేటి యువత సమాజంలో మూఢవిశ్వాసాలకు, దురాచారాలకు వ్యతిరేకంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు కృష్ణ, వీర్రాజు, సత్యనారాయణ, రాంబాబు అభ్యుదయ గీతాలను ఆలపించారు. సాహితీ స్రవంతి పట్టణ గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, జనసేన నాయకులు లక్ష్మణ దివాకరన, అమబుత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.




# సాక్షి యాజమాన్యంపై కోర్టులలో పోరాటం చేస్తా



## - ఎమ్మెల్యే నల్లమిల్లి

**అనపర్తి, మేజర్ న్యూస్ :** సాక్షి పత్రికలో నిరాధారవార్త ప్రచురించి, నా గౌరవానికి భంగం కలిగించారని సాక్షి యాజమాన్యం నాకు క్షమాపణ చెప్పాలని లేదా నష్టపరిహారం చెల్లించాలని అంతవరకు కోర్టులో పోరాటం చేస్తానని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నెలలో పెదపూడి మండలం కైకవోలు గ్రామంలో చుట్టుప్రక్కల ఐదారు గ్రామాలకు చెందిన పది నుండి పన్నెండు మందిని గంజాయి కేసులో పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది.

ఈ క్రమంలో ఈ కేసులో నిందితుడిగా ఉన్న గణేష్ అనే వ్యక్తి ఎప్పుడో నాతో సెల్ఫీ దిగిన పోటోను సాక్షి పత్రికలో వేసి గంజాయి కేసులో అనపర్తి ఎమ్మెల్యే అనుచరుడు అంటూ హెడ్డింగ్ పెట్టి వ్రాసారు. కంటెంట్‌లో మాత్రం నిందితుడు చెప్పాడని గానీ, పోలీసు విచారణలో తెలిసినట్లుగానీ, నా అనుచరుడు అని గానీ ఎక్కడా ఏ మాత్రం తెలియపరచలేదని అయినప్పటికీ నన్ను అప్రతిష్ఠ పాలు చేసే ఉద్దేశ్యంతో ఇక్కడ వైయస్సార్ సిపి ఇంఛార్జ్ గా ఉన్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సాక్షి యాజమాన్యాన్ని ప్రభావితం చేసి సియంవో కార్యాలయంలో పనిచేసిన మాజీ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి సహకారంతో ఆ వార్త ప్రచురించడం జరిగిందని అన్నారు. ఈ వార్తకి ఎటువంటి సాక్ష్యాధారాలు వాళ్ళు చూపించలేదని, ఈ పరిస్దితులలో సాక్షి మీడియా బ్యూరో ఇంఛార్జితో బాటు ఐదుగురిపైన నేను పరువునష్టం దావా వేయడం జరుగుతుందని అన్నారు. ఈ కేసులో పన్నెండు మంది వ్యక్తులు ఉండి వారు వివిధ పార్టీలకు చెందిన వారని చెపుతున్నారు. గణేష్ అనే వ్యక్తి నాకు సన్నిహితుడైతే అయితే అతన్ని అరెస్టు కాకుండా నేను కాపాడుకునే వాడిని కదా అని ప్రశ్నించారు. ఈ విషయంలో సాక్షి యాజమాన్యం క్షమాపణ అయినా చెప్పాలి లేదా నష్టపరిహారం అయినా చెల్లించాలని అంతవరకూ నేను కోర్టులలో పోరాటం చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

# విద్యుత్ సరఫరా అంతరాయం



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు సబ్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 17వ తేదీ గురువారం మధ్యాహ్నం 03:00 గంటల నుండి సాయంకాలం ఐదు గంటల వరకు వరకు 33/11 కె.వి కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ నందు ఫీడర్ ట్రీ కటింగ్ నిమిత్తం కానూరు, నడుపల్లి ,ఉసులుమర్రు,కానూరు అగ్రహారం మరియు తీపర్రు గ్రామములకు సంబంధించి గృహ మరియు వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఎం నారాయణ అప్పారావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్స్ ఏపీ ఈపీడీసీఎల్ వారు కోరారు.

# వంటగ్యాస్ వినియోగించేటప్పుడు తగు జాగ్రత్తలు వహించాలి

## - పిఠాపురం అగ్నిమాపక అధికారి డి. రామకృష్ణ రాజు



**పిఠాపురం,మేజర్‌న్యూస్:** మహిళలు వంటగ్యాస్ వినియోగించేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని పిఠాపురం అగ్నిమాపక అధికారి డి. రామకృష్ణరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో... ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా జగ్గయ్య చెరువులో గల రెసిడెన్షియల్ అపార్ట్మెంట్స్ నందు మహిళలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వంట గ్యాస్ వాడటంలో తీసుకోవాల్సిన చర్యలు, అగ్ని ప్రమాదం జరిగితే ఎలా తప్పించుకోవాలి, అగ్నిమాప సిబ్బందికి సమాచారం అందించుట, తగు జాగ్రత్తలు తీసుకోవడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి డి.రామకృష్ణరాజు మరియు అగ్నిమాపక సిబ్బంది, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రూ.11.81 లక్షలు శ్రీశ్రీ నూకాలమ్మ హుండీల ఆదాయం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం నందు అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా బుధవారం దేవస్థాన కార్యనిర్వాహణాధికారిణి ఆర్.సౌజన్య ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ 34 రోజులకు గాను రూ.11.81,458/- హుండీల ద్వారా ఆదాయం సమకూరిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారులు కె.సోమరాజు, కె.వేణుగోపాల్, డి.శ్రీనివాసరావు, దేవస్థాన సిబ్బంది కామరాజు, మోహన్, వెంకటరమణ, భక్తులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టా చే క్రికెట్ పోటీలు ప్రారంభం







కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా మర్రిపూడి లాంటి చిన్న గ్రామంలో 32 జట్లతో క్రికెట్ పోటీలు జరగటం అభినందనీయమని, క్రికెట్ ఆటపై క్రీడాకారులకు ఉన్న ఆదరణ దీనికి కారణమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ పుట్టా సోమన్న చౌదరి అన్నారు.

రంగపేట మండలం మర్రిపూడిలో ఎం.ఎస్.ఎస్. ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగే పోటీలను ఆయన ప్రారంభించారు. 20 గ్రామాల నుండి 32 జట్లు పాల్గొనే ఈ పోటీలు ఈ నెల 28వ తేదీ వరకు జరుగుతాయని, ప్రథమ బహుమతి 30 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి 20వేలు రూపాయలుఅందజేస్తామని పోటీల నిర్వాహకులు బొలిశెట్టి తమ్మారావు, ఒడిసెల శ్రీను దూడిపూడి నాని ప్రకటించారు. మర్రిపూడికి యువ క్రికెట్ క్రీడాకారులు మణికంఠ సత్యానందం సూరిబాబు జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి పోటీ మేడపాడు మల్లంపూడి జట్ల మధ్య జరిగింది. ఈ కార్యక్రమంలో క్రీడా స్థలాన్ని సమకూర్చిన పాలచర్ల సూరిబాబు, జనసేన గ్రామ నాయకులు, దువ్వ సూరిబాబు, పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు. కాగా మర్రిపూడి సమీప గ్రామమైన గోలివారి కొత్తూరు యువకులు ఈ క్రీడలకు సంపూర్ణ సహకారాన్ని అందజేస్తున్నారు.

## జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన పథకానికి విరాళం




ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి బుధవారం నంద్యాలకు చెందిన ఎన్.నిరంజన్ కుమార్, హరిణి దంపతులు స్వామివారిని దర్శించుకొని రూ.10,116లు విరాళంగా అందించారు.

వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఆశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## కోనసీమ జిల్లా ఆక్వా అసోసియేషన్ అధ్యక్షునిగా సత్తిబాబురాజు



అమలాపురం, మేజర్ న్యూస్ : కోనసీమ జిల్లా ఆక్వా అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా దెందుకూరి సత్యనారాయణరాజు (సత్తిబాబు రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం అమలాపురం క్షత్రియ పరిషత్ అసోసియేషన్ హాలులో జరిగిన ఆక్వా రైతుల సమావేశానికి సీనియర్ ఆక్వా రైతు మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా ఆక్వా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అల్లవరానికి చెందిన దెందుకూరి సత్యనారాయణరాజు (సత్తిబాబు రాజు) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆయన అభ్యర్థిత్వాన్ని సీనియర్ రైతు నాయకులు త్సవటపల్లి నాగభూషణం, యాళ్ళ వెంకటానందం, దాట్ల పృథ్వీవర్మ, సయ్యపరాజు సత్తిబాబురాజు బలపరిచారు. సభ్యులంతా హర్షధ్వానాల మధ్య సత్తిబాబు రాజు ఎన్నికకు మద్దతు తెలిపారు. తోలేటి నానాజీ, మానే శ్రీను, మేడిద శంకర్, సత్తి శ్రీను బాబు, గవర దొరబాబు, గుత్తుల ధర్మరాజు, త్సవటపల్లి మణికుమార్, మోటూరి నానీ, సూదా శ్రీను, నంద్యాల శివాజీ, శివాజీ, కాయల బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఉత్సాహంగా ముగిసిన క్రికెట్ పోటీలు




గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెంలో ఉన్నటువంటి ఆదిత్య విశ్వ విద్యాలయంలో 2025కి సంబంధించి ఆదిత్య క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ టోర్నమెంట్ లో మొత్తం 100 కి పైగా టీమ్స్ పాల్గొనగా మొదటి స్థానం ఆదిత్య యూనివర్సిటీ ఎం సి ఏ ప్రథమ సంవత్సరం జట్టు కైవసం చేసుకొని ట్రోఫీతో పాటు రూ.25000 నగదు కైవసం చేసుకున్నారు.,

రెండవ స్థానం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సి. ఎస్. ఇ . తృతీయ సంవత్సరం జట్టు ట్రోఫీతో పాటు రూ 15000 నగదు బహుమతి,మూడవ స్థానం ఆదిత్య యూనివర్సిటీ తృతీయ సంవత్సరం సివిల్ జట్టు, ట్రోఫీతో పాటు రూ 10000 నగదు బహుమతి గెలుపొందారు, ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డా.ఎమ్ శ్రీనివాస్ రెడ్డి హాజరు అయ్యి విజేతలకు బహుమతులు అందించి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డా. ఎమ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రో వైస్ ఛాన్సెలర్ డా.ఎస్.రమాశ్రీ మేడం, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనా రాయణ,ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.ఎన్.రవి పాల్గొనటం జరిగింది.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే సత్యానందరావు





రావులపాలెం, మేజర్ న్యూస్ : రావులపాలెం క్యాంపు కార్యాలయంల వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆకుల రామకృష్ణ పాల్గొన్న ఈ ప్రజాదర్బార్ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి ప్రజలు వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ వినతులపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ప్రజాదర్బార్‌లో 292 వినతులు వచ్చాయని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం వినతులను ఆయా శాఖ అధికారులకు పంపుతామని తెలిపారు. గత ప్రభుత్వంలో జగన్ పేదలను మోసం చేసి ఇచ్చిన ఇళ్ల పట్టాలపై అధికంగా వినతులు, ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. వాటిని త్వరలోనే పరిష్కరించి అర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ర్యాలీలో కాలువలో పడి వ్యక్తి గల్లంతు

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : మండలంలోని ర్యాలీ గ్రామ శివారు బుల్లి రేవులో కాలువ వద్ద ఒక వ్యక్తి కాలు జారి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుల్లి రేవు కు చెందిన విత్తనాల భాస్కరరావు (68 ) బుధవారం ఉదయం కాలువ వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి గల్లంతయ్యాడు. వెంటనే విషయం తెలుసుకున్న బంధువులు, జాలర్లు కలిసి అమలాపురం కాలవ పొడవున గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఎటువంటి ఆచూకీ తెలియలేదు. అయితే ఒడ్డున చెప్పులు, స్థానిక కనకదుర్గ గుడి వద్ద అతని చేతి కర్ర ఉంది. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

## రైతులకు వరి కోతల్లో ఇబ్బంది రాకుండా చూడాలి- ఎంపిడిఓ



అల్లవరం, మేజర్ న్యూస్ : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ లకు ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో వరి కోతలు ఆరంభం అయినందున గ్రామాల్లో రైతులకు కూలీల కొరత లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులు ప్లాన్ చేయాలని, ఎక్కడా రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్, ఏపిఓ రాజా మణి, సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# రైతుల నుంచి ప్రతి గింజ కొంటాం

**- జిల్లా కలెక్టర్ షణ్మోహన్**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. రబీ 2024-25 సీజను ధాన్యం సేకరణకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార, రైస్ మిల్లర్లతో ధాన్యం కనుగోలు కమిటి సమావేశం నిర్వహించారు. కనీస మద్దతు ధర అమలు, రైతు సేవా కేంద్రాల నుంచి ధాన్యం కనుగోలు, తేమ శాతం, సీఎంఆర్, బ్యాంకు గారంటీలు, గోనె సంచులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్.. అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రైతుల ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కనుగోలు చేయడానికి వీలు లేదన్నారు. కనీస మద్దతు ధరపై రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 225 కనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని రైతు సేవా కేంద్రంలోని టెక్నికల్ అసిస్టెంట్ రైతుల కళ్ళల వద్దకు వెళ్ళి ధాన్యాన్ని పరిశీలించి డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసి వెహికల్ మూమెంట్ జీపిఎఫ్ ట్రాక్ చేసి మిల్లు కు పంపించడం జరుగుతుందన్నారు. రైతులు తాము పండిచిన ధాన్యాన్ని దళారులు, మధ్యవర్తుకులకు అమ్ముకొని మోసపోకుండా నాణ్యత ప్రమాణాలకు లోబడి తమ ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు మాత్రమే అమ్మాలన్నారు. జిల్లాలో నేటి వరకు 300 మంది రైతుల నుంచి సుమారుగా 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ధాన్యము సేకరణకు అవసరమైన గోనె సంచులను, హమలీలు, రవాణాకు అవసరమైన వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. సేకరించిన ధాన్యాన్ని రైతు కోరిన రైస్ మిల్లుకు జీపీఎస్‌తో కూడిన వాహనములో రవాణా చేయబడుతుందన్నారు. రైతులు ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు రవాణా వాహనాలను రైతులు స్వయంగా సమకూర్చుంటే ఆ సొమ్మును కూడా ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాలలో జమ చేస్తుందని రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు సూచించారు.

సమావేశంలో డీఆర్వో వెంకటరావు, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం దేవులా నాయక్, డీఎస్వో ఆర్ఎస్ఎస్ సీతారామరాజు,వ్యవసాయశాఖ జేడీ ఎన్.విజయ్ కుమార్, పాడా పీడీ ఎ.చైత్రవర్షణి, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ బుల్లి రాణి, డీసీవో,రాష్ట్ర రైస్ మిల్స్ అసోసియేషన్స్ సెక్రెటరీ వి.సూర్యప్రకాశ్ రావు, కాకినాడ జిల్లా రైస్ మిల్లు ప్రెసిడెంట్ ఎన్.రామకృష్ణ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధన కోసం పకడ్బందీ కార్యాచరణ ఉండాలి

**- ఫలవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి**

**- 2025-26 వార్షిక ప్రణాళిక పై సమన్వయ శాఖల అధికారులతో సమావేశం**

**- ప్రతి ప్రభుత్వ భవనం, ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చెయ్యాలి**

**- సమస్య తెలుసుకుంటే పరిష్కారం చూపడం సాధ్యం**

**- జిల్లా కలెక్టర్ ప్రశాంతి**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** 2025-26 కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక అమలు చేయటంలో ఎటువంటి డివియేషన్ లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో శాఖల వారీగా కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు సమర్పించిన శాఖకు సంబంధించి అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, జిల్లా రెవిన్యూ అధికారి టి సీతారామ మూర్తి లతో కలిసి అధికారులతో చర్చించడం జరిగింది.

వ్యవసాయ అనుబంధ రంగాలలో సీజనల్ టార్గెట్స్, హౌసింగ్, జిల్లా గ్రామీవభివృద్ధి తదితర శాఖలు నెలవారీ పురోగతి మేరకు లక్ష్యాలను సాధించేందుకు సరైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతినెల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతి నెలా, రాష్ట్ర స్థాయిలో ప్రతి మూడు నెలలకు తప్పనిసరిగా జిల్లా పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ ఉపయోగించి విత్త నాలు, ఎరువులు పురుగు మందులు వినియోగం, పంట మార్పిడి , న్యాచురల్ ఫార్మింగ్ పై కేసు స్టడీ చేయాలని స్పష్టం చేశారు. పంట మార్పిడి విధానాలు అమలు చేసే క్రమంలో విత్తనాలు పంపిణీ చేసే నాటి నుంచి దిగుబడి సాధించడానికి వరకు ఉన్న అంశాలపై కేసు స్టడీ చేసేందుకు సమర్థ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో సూచించిన విధానాలు వాస్తవ లక్ష్యాలను సాధించేందుకు తగిన సూచనలు ఇవ్వడం జరిగిందని, అదే విధం గా గూగుల్ క్యాలెండర్ ప్లాన్ సిద్దం చేసుకుని, స్టేజి వారిగా అమలు చేయడం ముఖ్యం అన్నారు. సమస్య తెలుసుకుంటే పరిష్కారం చూపడం సాధ్యం అవుతుందని తెలిపారు. నెలవారిగా లక్ష్యాలను సాధించేందుకు మొదటి నెల నుంచి కార్యాచరణ ప్రకారం అడుగులు వేయాలని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. నెలవారీ, మండల వారిగా చేపడుతున్న లక్ష్యం సాధించడం పై దృష్టి సారించాలని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. మైన్స్ శాఖ ఆధ్వర్యంలో నెలకు 24 వేల మెట్రిక్ టన్నులు, వర్షాకాలం కోసం 18 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకుని రావడం పై దృష్టి సారించాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. పశు కిసాన్ కార్డులు, వైద్య ఆరోగ్య శాఖ, మహిళ శిశు సంక్షేమ శాఖ, హార్టికల్చర్, పరిశ్రమల శాఖ, ఆర్ డబ్ల్యూ ఎస్, ఆర్ అండ్ బి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిట్స్ గ్రౌండింగ్ వంటి అంశాలు నెల వారీగా, మండలాలు వారీగా వార్షిక ప్రణాళికను అనుసరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీటి ట్రైబల్ గ్రూప్స్ కోసం ఆధార్ కార్డు జారీ, గృహాల గ్రౌండింగ్ వంటి అంశాలపై హౌసింగ్, ట్రైబల్ వెల్ఫేర్, గ్రామ వార్డు సచివాలయ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ భవనం, ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేసి పీఎం సూర్య ఘర్ పథకం అమలు పై దృష్టి సారించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సిన కన్వర్జెన్స్ సమావేశాలు ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయి అధికారులకి నివేదిక అందచేయాలని ఆదేశించారు. ప్రతి శనివారం హౌసింగ్ డే సందర్భంగా లబ్ధిదారులతో కలిసి స్టేజి కన్వర్షన్ విధానంలో చొరవ చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటేషన్ నిర్వహణ, ఆదాయ వనరులు పెంపు తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు పనితీరు చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.పబ్లిక్‌తో మాట్లాడి ప్రభుత్వ పథకాలు వివరించి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుతున్న సేవలు వివరించాలన్నారు. ప్రజా ప్రతినిధులతో కలిసి ఏప్రియల్ 21 స్కూల్స్ సందర్శన చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం పనులు అమలు తీరును సమీక్షించాలన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో 42 కిసాన్ డ్రోన్ యూనిట్స్ ఏర్పాటుకు చర్యలు

**- యూనిట్ ధర రూ.9.81 లక్షలలో 80 శాతం సబ్సిడీ పొందే అవకాశం**

**- జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** కిసాన్ డ్రోన్లతో గ్రామ స్థాయి వ్యవసాయ యంత్రాల బ్యాంకుల స్థాపన దిశగా ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డ్రోన్ వ్యవసాయ యంత్రాల బ్యాంకుల ఏర్పాటు పై వ్యవసాయ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు చేపట్టడం లో భాగంగా డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించే దశ లో డ్రోన్ యూనిట్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఇందు కోసం ఆసక్తి ఉన్న రైతు సంఘాల గ్రూపులను ఐదు మంది సభ్యులుగా బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 42 గ్రూపులను గుర్తించి, 19 గ్రూపు లకు చెందిన వారికి శిక్షణ నిమిత్తం పంపడం జరిగిందన్నారు. ఒకొక్క యూనిట్ ధర రూ.9,81,000 లలో తొలుత ఐదుగురు సభ్యులు గల యూనిట్ ధర ముందుగా చెల్లించాల్సి ఉంటుందని జేసి తెలిపారు. లబ్దిదారులు వాటాగా రూ.5 లక్షలు చెల్లించేందుకు ముందుకు వొచ్చే లబ్దిదార బృందాలకు బ్యాంకు ద్వారా మిగిలిన మొత్తం రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో యూనిట్స్ గ్రౌండింగ్ కోసం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ముందుకు రావడం జరిగిందని తెలిపారు. యూనిట్స్ గ్రౌండింగ్ అయిన తర్వాత రూ.7,84,000 మేర సబ్సిడి గ్రూప్ ఖాతాకు జమ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు మాట్లాడుతూ, యూనిట్స్ గ్రౌండింగ్ అయిన తర్వాత సబ్సిడీ మొత్తం ఫార్మర్ గ్రూప్ లోకి జమ చేయనున్నట్లు తెలిపారు. జిల్లో మేసర్స్ డ్రాగో డ్రోన్స్, విహంగ టెక్నాలజీ లు ఆధ్వర్యంలో యూనిట్స్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ఫార్మర్స్ గ్రూప్ లు రైతు సేవా కేంద్రం తో పరస్పర అవగాహన కలిగి ఉండాలన్నారు. యూనిట్స్ 15 రోజుల్లో గ్రౌండింగ్ చెయ్యడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, ఎల్ డి ఎమ్ పి ఎస్ ప్రసాద్, డి ఆర్డిఏ పిడి ఎన్ వి వి ఎస్ మూర్తి, అధికారులు బి సుజాత కుమారి, కె ఎన్ జ్యోతి, పాల్గొన్నారు.

## మ్యూజిక్ ప్రదర్శనలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన విక్టర్

**ఏలూరు,మేజర్ న్యూస్ :** మ్యూజిక్ ముద్దుబిడ్డలు పోల గాని విక్టర్ (రాంబాబు)తమ అత్యుత్తమ మ్యూజిక్ ప్రదర్శించి భవిష్యత్తులో మరెన్నో ప్రపంచ రికార్డులు అందుకోవాలని పలువురు సంగీత అభిమానులు కోరారు. గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన హలేల్ సంగీత పాఠశాల ద్వారా ప్రపంచ స్థాయిలో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ మ్యూజిక్ ప్రదర్శనలో తన మ్యూజిక్ ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం దక్కించుకున్నారు. ఏలూరు ఎన్‌టిఆర్ కాలనీకి ప్రాంతానికి చెందిన పాస్టర్. పోలగాని విక్టర్ ఆన్లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో పాల్గొన్న 1046 మంది విద్యార్థులు గంట సమయంలో కీబోర్డు వాయించి తమ ప్రతిభను కనబరచుకొని గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నారు. ప్రపంచ రికార్డు నెలకొల్పి ఈ బృందంలో వీరి మ్యూజిక్‌ని గుర్తించిన వరల్డ్ రికార్డు ప్రతినిధులు ఆనంద్ రాజన్,హల్లేలు మ్యూజిక్ పాఠశాల వ్యవస్థాపకుడు అగస్టీన్ దండంగిలు వీరిరు వురికి సర్టిఫికేట్లతో పాటు గోల్డ్ మెడల్స్ అందించారు. ఈ ఘనత సాధించిన పాస్టర్. పి.విక్టర్‌ని, వారి కుటుంబ సభ్యులు,బంధు మిత్రులు,శ్రేయోభిలాషులు, భవిష్యత్తులో అత్యుత్తమ మ్యూజిక్కు ప్రదర్శిం చి ఇలాంటి ప్రపంచ రికార్డులు మరిన్ని పొందాలని కోరారు.

# నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు

## - ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



రంపచోడవరం,మేజర్‌న్యూస్ : వచ్చే విద్యాసంవత్సరంలో ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని ప్రభుత్వపాఠశాలలో నాణ్యమైనవిద్యను అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టాసింహాచలం పేర్కొన్నారు.స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏజెన్సీ డీఈవో,మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, సహాయ గిరిజన సంక్షేమశాఖ అధికారులు, పియంయు అధికారులతో వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా క్వాలిటీ విద్యను అందించే విధంగా ఏజెన్సీ ప్రాంతంలో నూటికి నూరుశాతం సీట్లు నింపే విధంగా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి విద్యార్థి విద్యపై దృష్టి పెట్టే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.వచ్చే సంవత్సరం నుండి నూతన విద్యా విధానంపై దృష్టిపెట్టాలన్నారు.అంగన్వాడీ కేంద్రాల నుండి పాఠశాలలకు, పాఠశాలల నుండి హైస్కూల్‌కి వెళ్లే విద్యార్థులు ఎక్కడ జాయిన్ అవుతున్నది ఒకజాబితా తయారు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి అంగన్వాడీకేంద్రంలో నూటికి నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ ఉండేవిధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జడ్పీ పాఠశాలలలో విద్యార్థులకుకావలసిన మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు.ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం ఎంతమంది విద్యార్థులు జాయిన్ అయింది, ఎన్ని సీట్లు ఖాళీగా ఉన్నది ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలోని ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు సెలవులు నుండి తిరిగి వచ్చిన వెంటనే అన్ని తరగతులకు బేస్ లైన్ టెస్ట్ నిర్వహించాలన్నారు. ఏజెన్సీ డీఈవో, మండల విద్యాశాఖ అధికారులు, సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఒక షెడ్యూల్ ప్రకారం పాఠశాలలు పరిశీలించాలన్నారు. విద్యార్థులు సెలవులకు వెళ్లి తిరిగి వచ్చిన వెంటనే జూన్ 25 నాటికి విద్యార్థులందరికీ హెల్త్ చెకప్‌లు చేయాలన్నారు.వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రతి ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాల,ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ పాస్ అయిన తర్వాత మార్గదర్శి ప్రోగ్రాం ద్వారా ఏ చదువులు చదవాలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటర్మీడియట్ పాస్ అయిన గిరిజన విద్యార్థులకు మెడికల్ సీట్లు, ఇంజనీరింగ్ సీట్లు పొందే విధంగా ప్రత్యేక శిక్షణకు ప్రతిపాదన జరుగుతున్నాయన్నారు. ఏజెన్సీ ఉపాధ్యాయులకు ప్రత్యేక విద్యపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వేసవి సెలవుల్లో టీచర్లకు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం ఎక్కువ మార్కులతో పాస్ అయినవారికి ఐటీడీఏ ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ మండలాల్లో జూనియర్ కాలేజీలు, గురుకుల కాలేజిలలో ఎంతమంది విద్యార్థులు పాసైంది మండలాల వారిగా ఆరా తీశారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, సహాయ గిరిజ న సంక్షేమ శాఖ అధికారి కృష్ణమోహన్, మండల విద్యాశాఖ అధికారులు యం.సత్య నారాయణ,రామకృష్ణ,బాపన్న దొర, సూరారెడ్డి, ముత్యాల రావు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ సూపరిం టెండెంట్ బి.కిషోర్. గురుకులం సెల్ అధికారి నాగేంద్ర, పీఎంయు అధికారిని చంద్రకళ, ఈఆర్ఎంఎస్ ప్రిన్సిపాల్‌లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు,గిరిజనఆశ్రమపాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# డీసీసీబీ ఛైర్మన్‌గిరీ ఎవరి పరం..!





## - ఏకగ్రీవంగా మెట్ల రమణబాబు పేరు.?

## - సీనియర్ నాయకునికిగా ప్రాధాన్యత..

అమలాపురం, మేజర్ న్యూస్ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ ఛైర్మన్‌గిరీ కోసం కూటమిలో మల్లగుల్లాలు పడుతున్నారు.. ఇప్పటికే డీసీసీబీ ఛైర్మన్ పదవి కోసం మాజీ మంత్రి డాక్టర్ మెట్ల సత్యనారాయణ రావు తనయుడు, టీడీపీ సీనియర్ నేత మెట్ల రమణబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే ఏడాది కాలంగా ఉన్న డీసీసీబీ ఛైర్మన్ పదవి కోసం కూటమిలోనే మాకు కావాలంటే మాకు కావాలని గట్టి ప్రయత్నాలు చేస్తోండగా మొదటి ప్రాధాన్యత మెట్ల రమణబాబుకే దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే జనసేన పార్టీ నుంచి అటు బీజేపీ నుంచి కూడా సీనియర్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.అతి త్వరలోనే దీనిపై కూటమి అధిష్టానం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి తేల్చే పనిలో ఉండగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలు అంతా కూడా మెట్ల అభ్యర్థిత్వాన్నే బలపరుస్తున్నాయి. వీటితోపాటు ఉమ్మడి జిల్లాలో ఉన్న పీఏసీఎస్ ఛైర్మన్‌లు మెట్ల అభ్యర్థి త్వాన్ని బలపరుస్తున్నట్లు తెలు స్తోంది.దీంతో కూటమి నుంచి డీసీసీబీ ఛైర్మన్ పదవి మెట్ల సత్యనారా యణరావు తనయుడు మెట్ల రమణబాబుకే దక్కే ఛాన్స్ ఎక్కువగా కనిపిస్తోంది..

**పార్టీపట్ల వీరవిధేయునిగా ముద్ర..**టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పనిచేసిన డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు అమలాపురంలో టీడీపీకు బలమైన నాయకునిగా మంచి గుర్తింపును పొందారు. ఆయన మంత్రిగా పనిచేసిన కాలంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ఆయనకు మంచి పేరును తీసుకొచ్చాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అయిన అమలాపురంలో మెట్ల కుటుంబందే ప్రతీ విషయంలోనూ పై చేయిగా నిలుస్తుండగా టీడీపీకు కంచుకోటగా అమలాపురం నిలుస్తోన్న పరిస్థితి కనిపిస్తోంది.. ఆయన మరణాంతరం పార్టీ బాధ్యతను భుజాన వేసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హోదాలో మెట్ల రమణబాబు వేసుకుని గెలుపుకోసం కృషిచేశారు. 2014, 2024 ఎన్నికల్లో పార్టీ అమలాపురం నియోజకవర్గంతో పాటు జిల్లాలో పలు నియోజకవర్గాల్లో భారీ మెజార్టీ సాధించడం వెనుక రమణబాబు పాత్ర కీలకం అన్నది అంతా ముక్త కంఠంతో అంగీకరిస్తారు. ఈనేపథ్యంలోనే ఆయనకు ఇటీవల భర్తీ చేసిన ఎమ్మెల్సీ పదవులకు సంబంధించి పదవి వరిస్తుందని అంతా భావించారు. కానీ చోటుచేసుకున్న అనేక సమీకరణాల నేపథ్యంలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి తృటిలో తప్పింది..

అయితే రమణబాబుకు సముచిత స్థానం ఇస్తామని ఇప్పటికే పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, యువనేత మంత్రి నారాలోకేష్ కూడా హామీ ఇచ్చారు. అదేవిధంగా అమలాపురం శాసన సభ్యుడు అయితాబత్తుల ఆనంద రావు, పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్ మాధూర్ బాలయోగితోపాటు పలువురు ఎమ్మెల్యేలు కూడా రమణబాబుకు మంచి పదవి ఇవ్వాలని అధిష్టానంపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్న వేళ రమణబాబుకు ఈసారి డీసీసీబీ ఛైర్మన్ పదవి ఖాయం అన్నది ఇక లాంఛనమే అన్నట్లు తెలుస్తోంది. దీనికితోడు సమర్థుడైన నాయకునిగా ముద్రవేసుకున్న రమణబాబు కాపు సామాజికవర్గానికి చెందిన వారు కావడం కూడా ఆయనకు కలిసొచ్చే అంశంగా మారడం, రమణబాబు అభ్యర్థిత్వాన్ని అటు జనసేన, ఇటు బీజేపీ కూడా వ్యతిరేకించదన్న మాటలు వినిపిస్తున్నాయి.. ఏదిఏమైనా మెట్ల రమణబాబుకు డీసీసీబీ ఛైర్మన్ పదవి ఇవ్వడం వల్ల టీడీపీతోపాటు కూటమికి రాబోయే రోజుల్లో మంచే జరుగుతుందన్న మాటలు వినవస్తున్నాయి..

### ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నల్లమిల్లి




అనపర్తి, మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి నియోజకవర్గం కేంద్ర ప్రాంతమైన అనపర్తి గ్రామంలోని రజక కమ్యూనిటీ హాల్ నందు బుధవారం ప్రజా సమస్యలపై ఫిర్యాదు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి బుధవారం నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదు స్వీకరణ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించడం జరిగిందని, ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారమే ఈరోజు అనపర్తి గ్రామంలో ప్రజల నుండి వారి సమస్యలపై ఫిర్యాదు స్వీకరించడం జరిగిందని అన్నారు. ప్రజా సమస్యల్లో రోడ్ల, డ్రైనేజీల, తాగునీటి, విద్యుత్ తదితర అంశాలపై 26 ఫిర్యాదులు రావడం జరిగిందని వాటిని అన్నింటిని త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇక నుండి ప్రతి బుధవారం నియోజకవర్గ మండల కేంద్రంలో నిర్వహిస్తామని,తద్వారా నియోజకవర్గంలోని ప్రజలందరకు సమస్యలపై ఫిర్యాదు చేసుకునే అవకాశం లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం వినతులను ఆయా శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారించే దిశగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ప్రజా సమస్యల పరిస్కారం చేయడం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్న ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలోనాలుగు మండలాల అధికారులు, అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన




పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : కాకినాడ జిల్లా ఎస్.పి. బింధు మాధవ్ ఆదేశాల మేరకు, డిఎస్‌పి డి.శ్రీహరిరాజుల సూచనలతో బుధవారం ఎస్సై వి.మౌనిక ఆధ్వర్యంలో సిఐ విజయ్‌శంకర్ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా సిఐ విజయ్ శంకర్ స్థానిక మున్సిపల్ సెంటర్, బస్టాండ్ సెంటర్‌లలో వాహనదారులకు,విద్యార్థులకు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడకపోతే జరిగే నష్టాల గురించి, డ్రగ్స్ వాడకంపై నష్టాల గురించి వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం



పెద్దాపురం,మేజర్‌న్యూస్ : పెద్దాపురం ఫైర్ స్టేషన్ నందు అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం ఎడిఎఫ్ఓ ఎన్.శ్రీహరి జగన్నాధ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ నగర్ అపార్ట్‌మెంట్స్ వద్ద ఎల్‌పిజి సేఫ్టీకి సంబంధించి ప్రజలకు అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎడిఎఫ్ఓ ఎన్.శ్రీహరిజగన్నాధ్ తెలుపుతూ అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. దీనిలో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించి, అగ్నిమాపక సిబ్బంది సేవల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పి.ఆర్.ఆర్.ప్రసాద్,ఎం.రామకృష్ణదొర,ఎండి.యాకుబ్,ఎం.గీతా ప్రసాద్, సిహెచ్.నాగేశ్వర్, డి.నానాజీ, ఎన్.రాజు,పాల్గొన్నారు.